# మర్త్యలోకం - మరోలోకం

స్మశానంలో రెండుచితులు పేలుతున్నాయి. ఆ చితుల్లోంచి వచ్చిన రెండు పొగలు ఉంగరాలు చుట్టుకుంటూ లేచిపోయి, తాటిచెట్ల తలలు దాటి ఇంకా పైకిపోయి నల్ల మబ్బు చాటున కలుసుకున్నాయి.

'నువ్వెప్పుడు చచ్చిపోయావ్ ?' ఒక పొగలోంచి ఆడ పొగ తేరిపారచూసి అడిగింది.

'హమ్మయ్య ! నువ్వూ చచ్చిపోయావా ?' అంది మగ గొంతు.

'నేను చచ్చిపోతే నీ కెందుకు తృప్తి ?'

'నువ్వు పోయినందు క్కాదు. మనిద్దరం జంటగా ఈ లోకాన్ని విడిచిపెట్టినందుకు.'

'ఆఁ...ఏమన్నావు ?'

'అదేవిటి అట్లా అంటావ్ ! ఆనాడు గుళ్ళో పౌర్ణమి నాటి రాత్రి పారిజాతంచెట్టు నీడన మనం ఇద్దరం కలిసి బతికి నంతకాలం ఇద్దరం విడిపోవద్దు. మరణించినా ఇద్దరం కలిసే మరణిద్దాం' అనుకోలేదూ—

'నీ జన్మ తగలెయ్య ! నిన్నూ, నీ జన్మని తగలేసినా నీ బుద్ధిపోయిందికాదు. ఆనాడు ఆ మాట అనుకోటంకాదు. ప్రమాణం చేసికొన్నాం. బతికినంతకాలం కలిసి బతుకుదా మన్న మొగాడివి నాకు నెలతప్పిందని తెలియంగానే ఐపు లేకుండా ఎందుకు పారిపోయావ్ ?'

'ఏం చెయ్యను చెప్పు. పరిస్థితులు...'

'పరిస్థితులా—ఎందుకా నేలచూపులు? పెద్ద పశ్చాత్తా పంలో మునిగిపోతున్న వాడిలాగా?'

'నన్ను నువ్వు అర్థంచేసికోటంలేదు. ఆనాడు మా అమ్మా, నాన్నా...'

'అవున్లే మీ అమ్మా నాన్నా—అంతకంటె ముఖ్యం నువ్వు. నీ కోసం, మీ అమ్మా నాన్నాకోసం, సర్వం విడిచి వచ్చి నిన్నే నమ్ముకున్న నన్ను బలిపెట్టావు ... అంతేగా! ఇట్లా అనుకుంటే నిన్ను అర్థంచేసికొన్నట్లు కాదు. ఇంకోలా అనుకోవాలికదూ...'

'అట్లా మాట్లాడి నా హృదయం ఎందుకు ముక్కలు చేస్తావ్?'

'నీకుతోడు హృదయంకూడానా? నీకేవన్నా హృదయ మంటూ ఉంటే నన్ను నట్టేట్లో ముంచి నెల తిరక్కుండా కరణంగా రమ్మాయి మెళ్ళో తాళికడ్తావా?'

'నువ్వుమాత్రం ఏంచేశావేం, ఆ విశ్వనాథాన్ని పెళ్ళి చేసుకోలా?'

'చేసుకున్నాను. చేసుకున్న పాపానికి బతికినంత కాలం కుములుతూ చిన్నదానిమీద కళ్ళుపెట్టుకు బతికాను; ఛీ! ఏం జీవితం?'

'...అది నా కూతురేగా.'

'ఏ మొహంపెట్టు కంటున్నావ్ ఆమాట. బతికుండగా ఒక్కసారి పలకరించావా? ఒక్కసారి కన్నెత్తి చూశావా? పైగా నాకూ రజాక్‌కి సంబంధం ఉందని పుకారు పుట్టించింది నువ్వు కాదూ?

'ఏమో! ఎవరు చూశారు?'

కథా నిలయం
38491

'ఏయ్! మొగాడా? ఇష్టమొచ్చినట్టు పేలకు. బతికుండగా ఎట్లా కూసినా సరిపోయింది. ఇక్కడ ఇష్టమొచ్చినట్టు పోట్లాడటానికి నీలోకమూ లేదు, నీ డంబమూ చెల్లదు. ఇదుగో! ఒక్క మాట చెప్తున్నా విను. మనుషుల్లో ఆరోగ్యప్రదమైన మనస్సు ఇంకా కొంత నిలిచిఉందంటే అది స్త్రీలోనే. పరిస్థితుల నిర్బంధంవల్ల కానీ, సహజంగా కానీ–

'పోనీ అయిపోయిం దేదో అయిపోయింది. మనం ఇప్పుడు పోట్లాడుకోటం దేనికి? జరిగింది మర్చిపోకూడదూ?

'ఇప్పుడు పోట్లాడు కోటంవల్ల ప్రయోజనం ఏముందీ అన్నావు – బావుంది. మర్చి పోవటమంటావా – ఎట్లా సాధ్యం?– మర్చిపోయినట్లుగా కన్పించి సర్దుకు పోదాం. నేను ప్రళయాన్ని మింగి, కడుపులో బడబానలం పెట్టుకుని నవ్వుతూ కూర్చోగలను. అది నా కలవాటే.'

'అది సరేగాని నువ్వు ఆ బుంగమీసాల విశ్వనాథంతో ఎట్లా కాపురం చేశావ్?'

'ఏం? నువ్వు పొట్టి జడ చిట్టితో చెయ్యలా? నీకంటే ఆయన కేం తక్కువ?'

'నిన్ను రోజూ కొట్టేవాడట కదూ?'

'నువ్వు చిట్టిని చావ గొట్టిం దానికంటె ఎక్కువా?'

'అన్నమన్నా పెట్టేవాడా?'

'నువ్వేదో వెలిగించినట్లు నా కాపురాన్ని వేలెత్తి చూపి, ఎగతాళి చెయ్యక్కర్లా.'

'నేను చిట్టికి ఏ లోపమూ చెయ్యలేదు.'

'అవును, ఆ మాటే నాతో చెప్పుకుని శోకాలు పెట్టేది. నువ్వు చచ్చినా నీలో ఇంకా పులుసు చావలేదేం?

ఇంకా ఎందుకు పౌరుషం పోతావ్? నీ జన్మకి స్త్రీని సంతోష పెట్టావా — నన్ను, చిట్టిని చివరికి కన్నతల్లికైనా హాయని పించావా? నీ బ్రతుకూ, నా బ్రతుకూ రోకటిపోటు లాంటిదే. ఇందులో కొత్తేమీ లేదు కాని, మీ వాళ్లూ, మా వాళ్లూ ఎందుకో ఏడుస్తున్నారు సరదాగా చూద్దాం ఉండు.'

స్మశానంలో విశ్వనాథం చెట్టు కానుకుని, ఉత్తరీయంతో మొహం కప్పుకొని దుఃఖిస్తున్నాడు. కాటికాపరి తిరగేస్తున్న కట్టెల పెట పెటల మ్రోతలో విశ్వనాథం తల్లి పెట్టే శోకాలు విన్పించటం లేదు.

'ఎంత అన్యాయం చేశావే!' విశ్వనాథం తల్లి బావురుమంది.

'చూశావా! చూశావా! అన్యాయం నేను చేశాన్ట.' ఆకాశంలో ఆడపాగ గొణిగింది. 'నేను చావకుండా ఈసడింపులు భరిస్తూ, నరకం అనుభవిస్తూ ఆ ఇంటికి వెట్టిచాకిరీ చెయ్యటం న్యాయం కాబోలు.'

చెట్టు కానుకున్న విశ్వనాథాన్ని బంధువు లెవరో పరామర్శించి వీపు రాస్తే బావురుమంటూ కుప్పకూలిపోయాడు.

'అయ్యో! ఇంత చిన్న పిల్లాడిలా అయిపోతున్నాడేం మరీ! పాపం రేపట్నించీ సమయానికి అన్నీ అందించి ఎవరు సాకుతారో! నిముషం ఆలస్యం అయితే చాలు చెంప ఛెళ్ళుమనేది. ఇవ్వాళ నేను చచ్చిపోగానే ఇంత ప్రేమ ఎక్కణ్ణించి వచ్చిందో — అంతా బూటకం! కాని ఎంత కర్కోటకుడైనా తనకు కావలసిన వేవోకూడా తనకు తెలియని అమాయకుడు. పాపం! రేపట్నించి ఎంత అవస్థపడతాడో ఏమో!' గుడ్లనీరు గుడ్ల కుక్కుకుంది ఆడపాగ.

'అయినా ఫరవా లేదులే. నాలుగురోజు లాగితే అంతా మర్చి పోతాడు. గుండెగల మొగవాడాయెను. ఇంకో చిలక లాంటి చిన్న దాన్ని పెళ్ళిచేసుకొంటాడు. సహజమేగా!' అని సర్ది చెప్పుకుంది ఆడపొగ.

'అమ్మా...' అంత ఏడుపుల్లోనూ ఒక చిన్న పిల్ల కేక చీల్చుకుని పైకి లేచింది.

'తల్లీ!' ఆడపొగ పరిచినట్లు విచ్చిపోయి కూలిపోతుంది.

'నీ ఒక్క-దానికోసం ఏడుస్తాను తల్లీ...నిన్ను నాలాగా కాకుండా ఈ లోకంలో మంచి బతుకు బతికేట్టు చేద్దామను కున్నాను. ఏం చేసేది? నీకు చెప్దామంటే నీకు ఊహ రా లేదు. నీ దురదృష్టం — ఆ ఏడుస్తున్నాడే—ఆ విశ్వనాథం అతడు నీకు నాన్న కాడు తల్లీ, ఆ ముసలావిడ నీకు నాయనమ్మ కాదు, ఆ శోకాలుపెట్టే బంధువులు నీ కేమీ కారు — ఎట్లా తెలు స్తాయి తల్లీ నీ కివన్నీనూ ?—

'ఏమిటోయ్ మొగాడా? నువ్వు కళ్ళొత్తుకుంటున్నావ్? కొంపతీసి నామీద జాలిపడడం లేదుగదా!' మొగపొగని ప్రశ్న వేసింది.

'లేదు. అటు చూడు మా ఆవిడ ఏడుస్తోంది.'

'అవును. ఏడుస్తోంది. ఆడది మరింకేం చేస్తుంది?'

'మహా ఇల్లాలు.'

'ఆ విషయం నువ్వు చచ్చిం తర్వాతగాని తెలియ లేదు కాబోలు. నీకు సర్వోపచారాలు చేసేదా?'

'ఆ.'

'సర్వం సమకూర్చి కంటికి రెప్పలాకూడా చూసేదా?'

'సరిగ్గా అట్లాగే.'

'నువ్వు ఏవన్నా పడుండే దనుకుంటూ.'

'ఆ.'

'అంత అవస్థపడుతూ ప్రతిరాత్రి నీ పక్క సుఖమయం చేసేదికదూ ?'

'మరేం.'

'దానికి ప్రతిఫలంగా నువ్వేం చేసేవాడివి ?'

'ఏం చెయ్యాలి. భార్యగా చేసుకున్నాను, పోషించే వాణ్ణి.'

'అంటే అన్నం పెట్టడమేగా ! దొడ్లో గేదెని కూడా నువ్వే పోషించేవాడివి కదూ !'

'గేదె నా భార్య కాదు.'

'కాని భార్య గేదెకంటె ఎక్కువేం కాదు.'

'ఆమెను నేను భార్యగా చేసుకున్నాను.'

'కాని ఎప్పుడైనా భార్యగా చూచుకున్నావా ?'

'చూచుకున్నానో లేదో నీకేం తెలుస్తుంది ? అటు చూడు. ఎట్లా ఏడుస్తుందో !'

'నువ్వు ఆమెని పెళ్ళి చేసుకున్నప్పుడే ఏడ్చింది. ఇన్ని రోజులూ లోలోపల ఏడుస్తూనే ఉంది. అది నీకు తెలియదు. ఇవ్వాళ బైటపడింది.'

'అతిగా వాక్కు — చీల్చేస్తాను.'

'పెద్దగా అరవకు అటు భూమ్మీద చూడు.'

స్మశానంలో చితిమీద కపాలం 'ఠప్'మని బద్దలయింది. జనమంతా గొల్లుమన్నారు.

'మూర్ఛపోకు మొగవాడా ! అది నీ కపాలమే!' అంది ఆడపాగ.

దూరంగా ఎక్కడో ఉరిమింది.

'నాకు భయం వేస్తోంది' బిక్కు బిక్కు మంటూ చూసింది ఆడపొగ.

'ఇక్కడ నీ కిం కెవరున్నారు ! నేనే నీకు తోడు.'

'నా కక్కర్లేదు. ఇంతకాలం ఉన్న తోడు చాలు. నేను ఒంటరిగా ఉంటాను.'

'మరి భయం వేస్తోందన్నావ్ ?'

దూరంగా ఇంకా ఉధృతంగా ఉరిమింది.

'నిజమే భయం వేస్తోంది...కాని ఒక్కమాట. నాకు భయంగా ఉంది కాబట్టి నీ తోడు కావాలంటున్నాను. నీ మీద మనసై కాదు. ఇప్పుడు నీ సాంగత్యం కోరుతున్నా కాబట్టి శాశ్వతంగా నన్ను నీ పక్కనే బంధించుకోవాలంటే కుదిరే పనికాదు. తర్వాత ఇద్దరం కలిసి ఉండటం, ఉండక పోవటం మన ఇష్టాఇష్టాలమీద ఉంటుంది. దాని కిష్టమై నాకు రక్షణ ఇవ్వగలవా ?' సూటిగా అడిగింది ఆడపొగ.

'ఓ అట్లాగే !' అంది మొగపొగ, ఒకసారి తన నీడలో కొచ్చి నుంచొని తప్పుకోలేదన్న ధీమాతో.

కొంతసేపటికి ఆకాశం నిర్మలమైంది. ఆడపొగ హడావుడిగా సర్దుకుంటోంది విడిపోవడానికి.

'ఎక్కడికో పోతున్నావ్ ?' అధికారికంగా అడిగింది మొగ పొగ.

'ఎక్కడికో నాకు తెలియదు. తెలిసినా నీకు చెప్పి తీరాల్సిన అవసరమేమీ నాకులేదు. కాని ఇక్కడమాత్రం ఉండ దలుచుకోలేదు.'

'నానుంచి వేరుపడి వెళ్ళిపోతే నువ్వు ఒడ్డునపడ్డ చేపలా అయిపోతావ్!'

'నీళ్ళలో మొసలి కండలుకోసుకు తింటుంటే, బాధగా బతకటంకంటె ఇదే మేలుకదూ!'

'నీ మీద నా ముద్రవుంది. అది చెరపలేవు.'

'ఈ గాలిని నువ్వు పీల్చావు. గాలిమీదకూడా నీ ముద్ర వుంది.'

'నిన్ను నేను ముద్దుపెట్టుకున్నాను. ఇంకొకళ్ళకి నువ్వు అపవిత్రమయ్యావు.'

'పిచ్చివాడా! నన్ను ముద్దుపెట్టుకుని నువ్వు పవిత్ర మయ్యావని తెలియటంలేదేం నీకు?'

'అయితే వెళ్ళిపోతానంటావ్?'

'నేనేమీ అనను. వెళ్ళిపోతాను. కాని ఒక్కమాట. దీపం వెలుగుని అనుభవించటానికి చూడు. ఆ దీపం నాదని మూతపెట్టేస్తే చీకట్లోపడతావ్.'

భూమిమీద రేవులో విశ్వనాథం సచేల స్నానం చేస్తున్నాడు. మరొకపక్క చిట్టి కరకంకణాలు పెట్టిపోతు న్నాయి. ఆకాశంలో ఆడపొగ నీలం పైటచెంగు గాలికి విసి రేస్తూ పైపైకి పోతుంటే మొగపొగ తెల్లగా తెల్లబోవటం వాళ్లెవరూ చూడలేదు.